శేష వాహనంపై శ్రీనివాసుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

శేషవాహనంపై ఊరేగుతున్న వెంకటేశ్వరస్వామి

తిరుమల తొలి గడప దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పెద్ద శేష వాహనంపై పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ప్రత్యేక కళాకారులు స్వామి వారి వాహనం ముందు కోలాటాలు, భజనలు చేసుకుంటూ ముందుకు సాగారు. రోజూ ఉదయం, రాత్రి స్వామివారి ప్రత్యేక అలంకరణతో వాహనాలపై భక్తులకు దర్శనమిస్తున్నారు. రాత్రి దేవుని కడప ఆలయంలో హరికథ కాలక్షేపాన్ని భక్తుల కోసం టిటిడి వారు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఫ్లెక్సీ ప్రింటింగ్‌పై నీలినీడలు!

- 26వ తేదీతో ముగియనున్న నిషేధం గడువు
- క్లాత్ బ్యానర్స్ ప్రింటింగ్‌కు రూ.లక్షల్లో పెట్టుబడి
- ఆందోళనలో యాజమాన్యాలు, కార్మికులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఫ్లెక్సీ ప్రింటింగ్ రంగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గతేడాది ఆగస్టు 26న విశాఖలో పర్యావరణానికి నష్టమనే పేరుతో ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం విధిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించడం తెలిసిందే. అనంతరం చోటుచేసుకున్న ఆందోళనల కారణంగా ఈ నెల 26 నుంచి ఫ్లెక్సీలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష కుటుంబాలు వీధిన పడుతున్నాయి. గత ఏడాది నవంబర్ ఒకటి నుంచి ఫ్లెక్సీ ప్రింటింగ్‌ను నిషేధిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై ఫ్లెక్సీప్రింటింగ్ యాజమాన్యాలు ఆందోళన చేయడంతో తాత్కాలికంగా వెనక్కితగ్గింది. ఈ ఏడాది జనవరి 26వ తేదీ నాటికి నిషేధం గడువును పొడిగించింది.

ఉమ్మడి జిల్లాలో 65 ఫ్లెక్సీ ప్రింటింగ్ మిషన్లు

ఉమ్మడి కడప జిల్లాలో 65పైగా ఫ్లెక్సీ ప్రింటింగ్ మిషన్లుఉన్నాయి. కడపలో 15, ప్రొద్దుటూరులో 10, రాజంపేటలో 9, రాయచోటిలో 6, బద్వేల్‌లో 8, రైల్వేకోడూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు పట్టణ ప్రాంతాల్లో నాలుగేసి చొప్పున కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ప్రింటింగ్ మిషనరీ కింద 12 నుంచి 25 మంది చొప్పున సుమారు 50 వేల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఫ్లెక్సీల వాహనాల ద్వారా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు.

60 శాతానికి పడిపోయిన వ్యాపారం

ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 60 శాతం వ్యాపారం తగ్గిందని ఫ్లెక్సీప్రింటింగ్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన అనంతరం రీసైక్లింగ్ చేసుకోవడం ద్వారా పర్యావరణానికి ఎటువంటి నష్టమూ వాటిల్లదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం సానుకూల

ప్రత్యామ్నాయాన్ని చూపించ కుండా నిబంధనల కొరఢా ఝుళిపించడంపై యాజమాన్యాలు వాపోతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం కాలుష్య నియంత్రణ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, శానిటేషన్ సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా పరిషత్ సిఇఒ, కలెక్టర్‌కు అప్పగించారు. ఈ నెల 26 తేదీ నుంచి నిబంధనలు ఉల్లంఘిస్తే పర్యావరణ చట్టం ప్రకారం ఫ్లెక్సీప్రింటింగ్ చదరపు అడుగుకు రూ.100 చొప్పున జరిమానా విధించనున్నారు. వీటికి పోలీస్, రెవెన్యూ ట్రాన్స్‌పోర్ట్, జిఎస్‌టి అధికారులు సహాయ పడతారని ఉత్తర్వుల్లో పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది.

భారంగా క్లాత్‌బ్యానర్ ప్రింటింగ్

క్లాత్ బ్యానర్ ప్రింటింగ్ మిషన్లు ఖరీదు కావడం నిర్వాహకులను ఆందోళనకు గురిచేస్తోంది. సుమారు రూ.60 లక్షల మేర వ్యయం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం గడిచిన మూడు నెలల వ్యవధిలో ఏఒక్కరికీ ఆధునిక మిషనరీలను అందజేయలేదు. ఆధునిక మిషనరీల కొనుగోలు చేయడానికి సాహసం చేయాల్సి వస్తోంది. ప్రస్తుత మిషనరీలనే క్లాత్‌బ్యానర్ ప్రింటింగ్‌కు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న ఆధునిక మిషనరీల కొనుగోలు కారణంగా అప్పుల్లో కూరుకునిపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

నేటి నుంచి ప్రింటింగ్ నిలిపేస్తాం

ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా మంగళవారం నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వానికి సంబంధించిన ఎటువంటి ఫ్లెక్సీలను ప్రింటింగ్ చేయొద్దని నిర్ణయించాం. జిఒ నెంబర్ 65ను నిషేధించాలని కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించాం. న్యాయస్థానాల నుంచి స్టే ఉత్వర్వులు వచ్చే అవకాశం ఉందనే ఆశాభావంతో ఉన్నాం. ప్రభుత్వం ఎటువంటి పర్యావరణ నష్టమూ వాటిల్లని నేపథ్యంలో నిషేధపు ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయం.

కె.చెన్నకృష్ణారెడ్డి, ఫ్లెక్సీ ప్రింటింగ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్, కడప.

పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలి

నేడు, రేపు ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నాలు

అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి

పర్యవేక్షణ పేరుతో అంగన్వాడీలపై వేధింపులకు గురిచేయడం తగదని, వెంటనే ఆపాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి పేర్కొన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీల పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24, 25 తేదీలలో ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫిబ్రవరి 6న చలో కలెక్టరేట్ కార్యాలయం చేపడుతున్నట్లు, ఆందోళన కార్యక్రమాలలో అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీలకు రూ.26 వేలు ఇవ్వాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంగన్వాడీలకు పేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలను తహశీల్దార్, ఎంపిడిఒ, రాజకీయ నాయకులు పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా నిత్యావసర వస్తువులు సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని పేర్కొన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు తగ్గించారని కోరారు. అంగన్వాడీ సెంటర్లను కుదిస్తున్నారని అన్నారు. గ్యాస్ ధరలు బాగా పెరిగిపోయాయని ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని తెలిపారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మీదేవి, జిల్లా నాయకులు ఉమ, వినీల, సుబ్బలక్ష్మి వసుంధర పాల్గొన్నారు. **అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలి..** అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చెయ్యాలని, కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనువాసులురెడ్డి హాజరై మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహార క్వాంటిటీ పెంచాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, అంగన్వాడీలకు సెంటర్ల పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని కోరారు.అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచెయ్యడం లేదన్నారు. గ్రామాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం సరిగా ఉండదని, ఫేస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేయడం సరికాదని చెప్పారు.

నిరంతర ఉద్యమాలు చేస్తాం : యుటియఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్

అధికారంలో ఏ ప్రభుత్వమున్నా విద్యరంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. సోమవారం యుటిఎఫ్ కార్యాలయంలో కడప ప్రాంతీయ మండలాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కూడా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపుతుందని భావించామని, అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రాథమిక విద్యా విధానాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పనిచేయడంతో పాటు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డం బాధాకరమన్నారు. విద్యాశాఖ పట్ల అధికారుల తీరు అన్యాయంగా ఉందన్నారు. ఉపాధ్యాయులను అడుగడుగునా హింసించడం, భయాందోళనలకు గురిచేయడమే పనిగా పనిచేస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆయన తీరు మార్చుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షురాలు రూతు ఆరోగ్య మేరీ, జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, దావుద్దీన్ నాయకులు సి.వి. రమణ, కరిముల్లా, గోపీనాథ్, శివకుమార్ రాజు, వెంకటరమణ, ప్రకాష్, శివ శంకర్, జావిద్, అస్లాం భాష, నాగరాజు, వీరనారాయణ,ఇబ్రహీం పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తరలింపును ఆపాలి

ప్రజాశక్తి కడప అర్బన్

జిల్లా బ్రహ్మంగారి మఠంలోని గురుకుల పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థులను సగిలేరు గురుకుల పాఠశాలకు తరలింపును వెంటనే ఆపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బుక్కే సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం డిప్యూటీ కలెక్టర్‌కు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో వరుసగా విద్యార్థులు తెలుగుగంగ కాలువలో గల్లంతై మృతిచెందడంతో విద్యార్థులకు రక్షణ కల్పించకుండా పోయిందని వాపోయారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటర్మీడియట్ విద్యార్థులను తరలించడం దారుణమన్నారు. సగిలేరు గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు అక్కడ ఎవరు ఉండలేక అందరూ ఇళ్లకు వెళ్లిపోయారన్నారు. ఇప్పటికైనా విద్యార్థులను యధావిధిగా బ్రహ్మగారి మఠంలోనే కొనసాగించాలని తెలిపారు. స్పదించిన డిప్యూటీ కలెక్టర్ బ్రహ్మగారి మఠంలోనే విద్యార్థులకు కొనసాగించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న 2018 డిఎస్‌సి ఉపాధ్యాయులకు వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు కోరారు. సోమవారం డిఇఒ దేవరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఇటీవల కాలంలో మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను విద్యాశాఖలోకి రాష్ట్ర ప్రభుత్వం విలీనం చేసిన తర్వాత ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులకు ఎంఇఒలు, హైస్కూల్ ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులు డ్రాయింగ్ ఆఫీసర్స్‌గా జీతాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న డిఎస్‌సి ఉపాధ్యాయులకు సంబంధించి ప్రొబేషన్ డిక్లరేషన్ కాలేదన్నా నెపంతో ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారి వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయకుండా నిలిపివేశారని తెలిపారు. ప్రొఫెషన్ డిక్లరేషన్ ను జీతాలతో ముడి పెట్టకుండా వారికి వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్పందించిన డిఇఒ ప్రొబెషన్ డిక్లరేషన్తో సంబంధం లేకుండా మున్సిపల్ ఉపాధ్యాయులకు వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దావుద్దీన్, నాయకులు సి.వి. రమణ, జావిద్ పాల్గొన్నారు.

27న మినీ ఉద్యోగ మేళా

ప్రజాశక్తి - కడప

జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిఆర్‌డిఎ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27న శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో రెండు ప్రముఖ కంపెనీలతో మినీ ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పి. దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ సిఎల్ కంపెనీలో ఐటి సాఫ్ట్‌వేర్ అసోసియేట్, ఎల్ఐసిలో ఆర్‌సిఎ, సిసిఎ ఏజెంట్స్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పైన పేర్కొన్న రెండు ప్రముఖ కంపెనీలలో వివిధ హోదాలో పనిచేసేందుకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఏదైనా డిగ్రీ పాసైన మహిళా, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9063623706, 9908051624లలో సంప్రదించాలన్నారు.

లే ఔట్లలో అన్ని వసతులు కల్పించాలి : కలెక్టర్

కడప : జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.ఎం. సాయికాంత్‌వర్మ, ట్రైనీ కలెక్టర్ రహుల్ మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్య , ఇన్‌ఛార్జి డిఆర్ఒ రామ్మోహన్‌తో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, ఒటిఎస్ ప్రక్రియల యాక్షన్ ప్లాన్‌తో పాటు అభివృద్ధి పనులు పురోగతి, తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై కలెక్టర్ వి.విజయరామరాజు.. నేరుగా సమీక్షించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌పి అన్బురాజన్ అన్నారు. సోమవారం హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఎస్‌పి హెల్మెట్ ధరించి స్వయంగా బుల్లెట్ వాహనం నడుపుతూ ర్యాలీలో పాల్గొని వాహనదారుల్లో జోష్ నింపారు. ర్యాలీ హరిత హోటల్ నుంచి కోటిరెడ్డి సర్కిల్, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్, మహావీర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా తిరిగి హరిత హోటల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్‌లో సెల్ ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని తల్లి దండ్రులు గుర్తుంచుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఒక కుటుంబం ఆర్థికంగా ఎంతో నష్టపోతుందని చెప్పారు. . కార్యక్రమంలో డిటిసి మీరా ప్రసాద్, కడప డిఎస్‌పి బి. వెంకట శివారెడ్డి, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ రాజా ప్రభాకర్, నగరంలోని సిఐలు, ఎస్ఐలు పోలీస్, రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటడం జీవనశైలిగా మారాలి

కడప అర్బన్ : మొక్కలు నాటడం, వాటి బాగోగులు చూడడం ప్రతి పౌరుడి జీవనశైలిలో భాగం కావాల్సిన అవసరముందని ఎల్ఐసి కడప డివిజనల్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ అన్నారు. దేశవ్యాప్తంగా సొంతభవనాలున్న అన్ని ఎల్ఐసి సెంటర్లలో మొక్కలు నాటే కార్యక్రమం చేయాలన్న పిలుపు మేరకు సోమవారం డివిజనల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను సాధించడం తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకుందని అన్నారు. కార్బన్ ఉద్గారాలను, కాలుష్యాన్ని నియంత్రించే విషయంలో బాగా అభివృద్ధి చెందిన దేశాలు బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవడం, ప్రస్తుత స్థితికి కారణమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసి కేంద్ర కార్యాలయం మార్గదర్శకాల మేరకు ఈ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో అధికారులు జగన్నాథ్ శ్రీనివాస్, ఆనందరావు, పిఆర్‌ఆర్‌సి. కుమార్, సరళ, సుధ, పద్మజ, శ్రీనివాస్, సుదర్శన్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పనితీరు భేష్

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న చైర్మన్ రామమోహన్‌రావు

కడప డివిజన్ విద్యుత్ శాఖ అధికారుల పనితీరు భేష్ అని చైర్మన్ (సిజిఆర్ఎఫ్ఐసి) కె. రామమోహన్ రావు కితాబు నిచ్చారు. సోమవారం కోపరేటివ్ కాలనీలోని కడప డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణంలో 'విద్యుత్ ప్రత్యేక లోక్ అదాలత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక లోక్ అదాలత్‌లో విద్యుత్ వినియోగదారుల నుంచి కేవలం నాలుగు సమస్యలు మాత్రమే తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ఇందులో విద్యుత్ బిల్లుల వ్యత్యాసాలు, అగ్రికల్చర్‌కు సంబంధించిన సమస్యలు ఉన్నట్లు తెలిపారు. కడప డివిజన్ విద్యుత్ శాఖ పరిధిలో పనిచేస్తున్న డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్, నరసింహ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చాంద్ బాషా, మునిస్వామి, ఎడిఇ లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు బాగా పనిచేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. రాబోవు రోజుల్లో కూడా ఇలాగే పనిచేసి విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి సమస్యలు వెంటనే పరిష్కరించి, విద్యుత్ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నండర్ టెక్నికల్ ఎస్.ఎల్. అంజని కుమార్, విద్యుత్ శాఖ కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. నరసింహ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు షేక్ చాంద్ భాష, నాగ మునిస్వామి, అకౌంట్స్ ఆఫీసర్ మల్లికార్జున, ఎడిలు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈలు, సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను చెల్లింపులో మెలకువలు

కడప : ప్రభుత్వ ఉద్యోగుల ఆదాయ పన్ను చెల్లింపు విషయంలో మెలకువలు తప్పక పాటించాలని. ఈ విషయంలో ఆయా శాఖల డిడిఒదే పూర్తి బాధ్యత అని జిల్లా ఖజానా అధికారి ఎం.ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో ఆయన అధ్యక్షతన ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదాయ పన్ను శాఖ అధికారి రాజశేఖర్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఖజానా అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదాయపు పన్ను చెల్లింపుల వ్యవహారాల్లో డిడిఒలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడూ ఉద్యోగుల ఆదాయ పన్ను వివరాలను పరిశీలించుకోవాలన్నారు. ఉద్యోగులు వ్యక్తిగత ఈ మెయిల్, మొబైల్ నంబర్ లనే ఆదాయ పన్ను చెల్లింపులో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు, పలు ప్రభుత్వ శాఖల డిడిఒలు ఉద్యోగులు హాజరయ్యారు.

హజ్ భవన్‌ను పునఃప్రారంభించాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ నాయకులు

రాష్ట్రంలో ముస్లిములు అత్యంత పవిత్రంగా భావించే హజ్ హౌస్ (హజ్ భవన్)ను వెంటనే పునఃప్రారంభించాలని కడప హజ్ హౌస్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సయ్యద్ సలావుద్దీన్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనలో కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ కడప హజ్ హౌస్‌కు యుద్ధ ప్రాతిపదికన రక్షణ కల్పించాలని కోరారు. రాయలసీమ ప్రాంతంలోని ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లే సౌలభ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సుమారు రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించి 2019 సంవత్సరంలో లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. నిర్మాణం పూర్తయి ఐదేళ్లయినప్పటికీ కడప హజ్ హౌస్ నుంచి అధికారిక కార్యకలాపాల నిర్వహణ, హజ్ కార్యాలయం ప్రారంభం, హజ్ యాత్రికుల బస, హజ్‌కు వెళ్లే హజ్ యాత్రికుల ఇమ్మిగ్రేషన్ తదితర అధికారిక కార్యకలాపాలు మొదలు కాలేదని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన హజ్ హౌస్ లో ప్రారంభించాలని కమిటీ కోరారు. కార్యక్రమంలో కో - కన్వనర్ లు షేక్. నజీర్ అహ్మద్, అమీర్ బాబు, సోషల్ వర్కర్ తన్వీర్ జమీల్, అన్వర్, ఎంఆర్ఎఫ్ దస్తగిర్, జాహిరుద్దీన్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు

పోరుమామిళ్ల టౌన్ : రంగసముద్రం గ్రామపంచాయతీలో కేవలం రెండు అంతస్తులకు మాత్రమే పరిమిషన్ ఉండగా నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రసాద రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పరిమితికి మించి కట్టడాలు కడితే భవిష్యత్‌లో ప్రమాదం వాటిల్లనుందని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్‌కు 45 అడుగుల రోడ్లు ఉండాల్సి ఉండగా కేవలం ఐదారు మీటర్లతో పెద్ద పెట్ట కట్టడాలు నిర్మిస్తున్నారని వాపోయారు. అగ్నిమాపక శాఖ, పంచాయతీ అప్రూవల్ తీసుకోకుండా కడుతున్న వారికి అధికారులు తీసుకోవాలన్నారు.

1998 మెమోను రద్దు చేయాలి

కడప : 1998 సోషల్ (వెల్ఫేర్ సర్క్యులర్) మెమోను రద్దు చేయాలని కోరుతూ సోమవారం జాయింట్ కలెక్టర్ సాయి కాంత్‌వర్మకు దళిత క్రైస్తవ సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కడప జిల్లా పాస్టర్ల సంఘం నాయకులు మల్లెం విజయభాస్కర్ మాట్లాడుతూ మన దేశం సెక్యులరిజం కలిగిన దేశమన్నారు. లౌకిక ప్రజాస్వామ్య భారతదేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ మత స్వేచ్ఛ, మత స్వతంత్రత, హక్కును కల్పించిందని అన్నారు. కొందరు స్వార్థపరులు, పాలకులు, ఆ హక్కులను దళిత క్రైస్తవులకు దూరం చేశారన్నారు. మెమో రద్దు కోసం పలువురి అధికారులకు వినతి పత్రాలు అందజేశామని ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో. బిషప్ దేవన్న, దళిత సంఘ నాయకులు, సోమన్న, భావ రత్నం, అక్కి దాసరి ఏసన్న, పాస్టర్లు. ప్రేమానందం, డేవిడ్ రాజు, జాన్, కస్తూరి సుధాకర్, అమర్, ఇశ్రాయేలు, సుభాకర్, అలెక్స్ సురేష్, సుదీర్, ప్రేమ కుమార్, ఎస్సీ నాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

రామ్‌గోపాల్‌రెడ్డికి సహకరించాలి

కడప అర్బన్ : తెలుగు దేశం పార్టీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాం గోపాల్ రెడ్డికి మద్దతు ఇచ్చి సహకరించాలని టిడిపి నాయకులు కోరారు. సోమవారం నగరంలోని పోస్ట్ ఆఫీస్, తహశీల్దార్ కార్యాలయం, ఎస్ఎఫ్‌సి, ఎపిఐఐసి, పెన్షనర్ కార్యాలయాలలో రాం గోపాల్ రెడ్డికి మద్దతుగా కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వికాస్ హరి, టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ జనార్ధన్, టిడిపి నేత బసిరెడ్డి కృష్ణారెడ్డి ప్రచారం నిర్వహించారు. మండలిలో నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గళం వినిపించేందుకు పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ మీడియా కో-ఆర్డినేటర్ విశ్వనాథ్, వెంకటేష్, పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు కృషి : జడ్జి

కడప : బాలల సంరక్షణకు పిల్లల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి సంబంధిత శాఖల అధికారులందరూ చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత ఆదేశించారు. సోమవారం ఆశ నిలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ కాంప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల పిల్లల కోసం న్యాయ సేవ పథకాన్ని వివరించారు. కొత్త పథకం ప్రకారం విభిన్న ప్రతిభావంతులైన పిల్లల పట్ల ఎలాంటి వివక్షత చూపరాదని, 18 సంవత్సరాలు వచ్చేవరకు వీరికి ఉచిత విద్యను అందించాలన్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలకు నల్సా అమలు చేస్తున్న ఈ పథకం గురించి సమగ్ర సమాచారం , నిబంధనలు పంపించామని ఆమె తెలియజేశారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప ద్వారా విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు న్యాయ సేవలు వారి హక్కుల పరిరక్షణకై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తామని చెప్పారు.

గ్రహణ మొర్రి బాధితులకు శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గ్రహణ మొర్రి బాధితులకు శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, బసవరామతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్ ముకుంద రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని భవిత పాఠశాల ఆవరణలో గ్రహణ మొర్రి బాధితులకు ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. కడప, అన్నమయ్య జిల్లాల నుంచి దాదాపు 40 మందికి పైగా గ్రహణమొర్రి బాధితులు శిబిరానికి వచ్చారన్నారు. ప్రాథమిక పరీక్షల అనంతరం వారికి శస్త్ర చికిత్సలు హైదరాబాదులో ఉచితంగా నిర్వహించనున్నట్లు వారి పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జోషి, సమగ్ర శిక్ష సహిత విద్య జిల్లా సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి, సెక్టోరల్ అధికారులు దశరథ రామిరెడ్డి, రమణమూర్తి, లక్ష్మీ నరసింహరాజు పాల్గొన్నారు.

సమస్యలు వేగంగా పరిష్కరించాలి : కలెక్టర్

కడప : అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు జెసి సాయికాంత్ వర్మ, ఇన్‌ఛార్జి డిఆర్ఒ మోహన్ రావు, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్‌నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, చంద్రమోహన్ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. చక్రాయపేట మండలం రెడ్డివారి పల్లి గ్రామానికి చెందిన బీసం సుబ్బమ్మ తనకు కిడ్నీ వ్యాధి సమస్య ఉందని బాగు చేయించుకోవడానికి ఆర్థిక, వైద్య సాయం చేయాలని కోరారు.

క్రికెట్ అభివృద్ధికి సహకరిస్తాం

ప్రజాశక్తి - కడప



క్రికెట్ నెట్స్‌లో వసతులను పరిశీలిస్తున్న రెడ్డి ప్రసాద్

జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్, డిసిఒ ఖాజా మైను ద్దీన్ క్రికెటర్లకు హామీ ఇచ్చారు. సోమ వారం వారు కడప లోని మున్సిపల్ గ్రౌండ్‌లోని కడప సబ్‌సెంటర్‌ను సందర్శించారు. కడప సబ్ సెంటర్ జరుగుతున్న క్రికెట్ కార్యకలాపాలను గమని ంచారు. అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కడప సబ్ సెంటర్లో ని క్రికెట్ నెట్స్‌లో మంచిగా సాధన చేసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు, వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పి. విజయ్ కుమార్, కె. విష్ణుమోహన్‌రావు, మహ్మద్, ఇలియాస్ పాల్గొన్నారు.

సైన్స్ సంబరాలలో రాష్ట్ర స్థాయి విజేతలు వీరే...

కడప అర్బన్ : జిల్లా కేంద్రంలో ఈనెల 21, 22వ తేదీలలో నిర్వహించిన జెవివి చెకు ముకి సైన్స్ సంబరాలు రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన టీముల వివరాలను సోమవారం రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మీడి యాకు తెలియజేశారు. బహు మతుల ప్రధాన ఉత్సవాన్ని ఆదివారమే నిర్వహించామని తెలిపారు. **ప్రభుత్వ పాఠ శాలల నుంచి..** పల్నాడు జిల్లా జడ్ పిహెచ్ఎస్ గణపవరం విద్యార్థులు, పి.నాగయశ్విత, వి.కార్తీక్ రెడ్డి, సి.యచ్. సాత్వీక మొదటి స్థానంలో నిలిచారు. చిత్తూరు జిల్లా జడ్‌పి హెచ్ఎస్ గొనుగూరు విద్యార్థులు బి.సౌమ్య, డి.యల్.చైతన్య కుమారి, యస్. ప్రణీత ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా కెఎస్ఆర్ఎం హైస్కూల్ విద్యార్థులు పి.అబ్షలూమ్, ఎస్.హంసిని, ఎస్. ప్రద్యూన్ రాజ్ తృతీయ స్థానంలో నిలిచారు. **ప్రయివేట్ పాఠశాలల నుంచి..** అనంత పురం జిల్లా లక్ష్మీ సన్‌రైజ్ స్కూల్ విద్యార్థులు కె. సాయ్‌గణేష్ క్రితికి, నవదీప్ గణేష్, సాయి శ్రావణి ప్రథమ స్థానంలో, కాకినాడ జిల్లా ఆదిత్యా టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఎ.అశోక్ స్వామి, జి. శ్రీనిజి, బి.యస్. యస్. ఆదిత్యా సాద్విక్ ద్వితీయ స్థానంలో, శ్రీ సత్య సాయి జిల్లా శ్రీ వాల్మీకి హై స్కూల్ విద్యార్థులు యన్. ఓం.కిరణ్, యస్. శ్రీధర్, యన్. విజ్జేశ్వర్ తృతీయ స్థానంలో నిలిచారు.

3న జడ్పీ సర్వసభ్య సమావేశం

కడప అర్బన్ : జిల్లా ప్రజా పరిషత్తు సర్వ సభ్య సమావేశం ఫిబ్రవరి 3న ఉదయం 10.00 గంటలకు నిర్వహి ంచనున్నట్లు జడ్‌పి సిఇఒ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్తు ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, శాసన మం డలి, శాసన సభ సభ్యులు, జిల్లా అధికారులు హాజరుకావాలని తెలిపారు.

హామీలను నెరవేర్చిన ఘనత వైసిపిదే

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత వైసిపి దేనని ఎమ్మెల్యే ఎస్. రఘు రామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కూన వారిపల్లె పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామపురం, పిచ్చపాటి పల్లె, దళితవాడ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచు భూమన సుబ్బారెడ్డి, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో -ఆప్షన్ సభ్యులు అన్నుకట్ల కరీముల్లా, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎస్.ఉప్పలపాడులో సోమవారం ఆయన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా అర్హులు ఉండి సంక్షేమ పథకాలు అందలేదంటే వారికి మంజూరు చేయిస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో పూర్తి మెజార్టీ ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గుర్రప్ప, వెంకటేష, రవిశంకర్‌రెడ్డి, ఉప్పలపాటి యోబు, డైరెక్టర్ మార్తుల్ శ్రీను, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లిప్ కార్యక్రమ అమలుపై సోమవారం ప్రధానోపాధ్యాయులకు డిఆర్‌పి తిరుమలకొండ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6,7,8 తరగతి విద్యార్థులకు బేస్ లైన్ (ప్రాక్టీస్ టెస్ట్ (ప్రీ టెస్ట్) మార్క్స్ లిప్ యాప్‌లో నమోదు చేసి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. టీచింగ్ పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్‌ల ప్రకారం బోధనను ఉన్నతాధికారులు పరిశీలిస్తారన్నారు. ఎల్‌ఐపి గైడ్ ప్రకారం విద్యార్థులను ఎ,బి,సిలుగా గుర్తించాలన్నారు. వెనకబడిన సి గ్రేడ్ విద్యార్థుల ప్రగతికి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి నుండి స్కూల్ స్థాయి వరకు ఎల్‌ఐపి మీద ఉన్నతాధికారుల సమీక్ష ప్రతి శుక్రవారం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : లిప్ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు తరగతి గదిలో బోధించాలని మండల మానటరింగ్ అబ్జర్వర్ చెరుకూరు శ్రీనివాసులు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు అభ్యసనాభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో అకాడమీ మానటరింగ్ అధికారి ఖాజా పర్వీన్, హెచ్‌ఎం రమణయ్య, దస్తగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం : కమిషనర్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు తయారు చేయడం కానీ, ప్రదర్శింపజేయడం కానీ పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని గమనించి రాజకీయ ప్రముఖులు, వ్యాపారులు అందరూ సహకరించాలని కమిషనర్ కోరారు.

నిబంధనలతో వాహనాలు నడపాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వాహనాలు నడిపేవారు నిబంధనలు తప్పక పాటించాలని పులివెందుల ఎంవిఐ బివి ప్రసాద్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్‌టిఒ కార్యాలయంలో ప్రయివేట్ పాఠశాల వాహన డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు మీమీద నమ్మకంతో పాఠశాలలకు పంపుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు బస్సు ఎక్కునప్పుడు, దిగేటప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై.. మరణిస్తే ఆ కుటుంబంలో తీరని వేదన మిగలడంతోపాటు కుటుంబ పెద్దను కోల్పోయిన ఎన్నో కుటుంబాలు వీధిన పడతాయని ఎంవిఐ నారాయణ నాయక్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎస్‌ఆర్‌ఐటి కాలేజిలో విద్యార్థులను ఉద్దేశించి రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరించారు కార్యక్రమంలో ఎఎంవిఐ శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ సిఐ యుగంధర్, డాక్టర్ వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు, మురుగు కాలువ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ ఆర్‌ఎస్ జంషీద్ ఆధ్వర్యంలో సోమవారం సిసి రోడ్డు, మురుగు కాలువ పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిసి రోడ్డును గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నిధులతో దాదాపు 86 మీటర్ల మేర దాదాపు రూ.10 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి షాహిద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో హర్షిత ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక అక్షర బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న టి.హర్షిత జాతీయస్థాయిలో పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ భూమిరెడ్డి విజయభారతి తెలిపారు. ఆ మేరకు సోమవారం హర్షితను కరస్పాండెంట్ అభినందించారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో హర్షిత నాల్గవ స్థానంలో రాణించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తెస్తూ జాతీయస్థాయిలో మరింతగా రాణించాలని ఆమె ఆకాంక్షించారు.

మట్టి మిద్దె కూలి మహిళ మృతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని నాగులకట్ట వీధిలో ఉన్న పాత మట్టి మిద్దె సోమవారం కూలిన సంఘటన లో నూర్జహాన్ (24) శిథిలాల్లో ఇరుక్కుని మృతి చెందింది. నాగులకట్ట వీధి మెయిన్ రోడ్డులో మట్టిమిద్దెలో మహబూబ్ బాషా, నూర్జహాన్ దంపతులు జీవిస్తున్నారు. వీరు మగ్గంపై జీవనా ధారం కొనసాగిస్తున్నారు. సోమవారం నూర్జహాన్ ఇంట్లో ఒక్కరే ఉన్న సమయంలో ఒక్కసారిగా పాత మట్టి మిద్దె కూలింది.

నూర్జాహాన్ చేయిపట్టుకుని నాడీ చూస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సమాచారం అందిన వెంటనే అర్బన్ సిఐ సదాశివయ్య సంఘటనాస్థలానికి చేరుకొని జెసిబి సహాయంతో శిథిలాలను తొలగించారు. శిథిలాల కింద కొన ఊపిరితో ఉన్న నూర్జహాన్‌ను కాపాడాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారని అర్బన్ సిఐ సదాశివయ్య తెలిపారు. భర్త మహబూబ్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మిట్టపల్లె వాసులకు స్థల సేకరణ

ప్రజాశక్తి - వేంపల్లె

కత్తులూరు పంచాయితీలోని మిట్టపల్లె గ్రామాన్ని నందిపల్లె పంచాయతీలో నిర్మిం చేందుకు రెవెన్యూ అధికారులు స్థల సేకరణ చేపట్టారు. ఇటీవల కత్తులూరు పంచాయతీలోని మిట్టపల్లె గ్రామానికి చెందిన ప్రజలు వేరే చోట స్థలం చూపి కాలనీ నిర్మించి ఇవ్వాలని ఎంపీ అవినాష్‌రెడ్డిని కోరారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి ఆధ్వ ర్యంలో నందిపల్లె పంచాయతీలో ఉన్న ప్రభుత్వ భూమిని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. నందిపల్లె పంచాయతీలోని 504 సర్వే నెంబరులో ఇంటి స్థలాలు కేటాయిం చేందుకు ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్నట్లు జడ్‌పిటిసి తెలిపారు. త్వరితగతిన మిట్టపల్లె గ్రామానికి చెందిన ప్రజలకు ఇంటి స్థలాలు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నందిపల్లె సర్పంచు సులోచన, మాజీ సర్పంచులు ప్రసాద్‌రెడ్డి, వీరలింగేశ్వరరెడ్డి, సర్వేయర్ శివారెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, మిట్టపల్లె ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్‌పిటిసి, తహశీల్దార్

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముద్దనూరు

బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఉమారాణి, ప్రవీణ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళ, బాలికల రక్షణ కోసం ప్రవేశపెట్టి అమ లు చేస్తున్న చట్టాలపై బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం సిడిపిఒ ముంతాజ్ బేగం ఆదేశాల మేరకు బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమం నిర్వహిం చారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బాలికల చట్టాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధారాణి, సూపర్‌వైజర్ భారతి, అంగన్వాడీ కార్యకర్త కిరణ్మయి, ఉపాద్యాయులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బాలికలకు విద్య తప్పనిసరి

చాపాడు : బాలికలకు విద్య తప్పనిసరి అని లక్ష్మీపేట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జవహర్ మునీర్ తెలిపారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బేటీ బచాఓజజ బేటీ పడావోపై లక్ష్మీపేట అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ మునీర్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న అవకాశాలను బాలికలు సద్వినియోగం చేసుకొని రాణించాలన్నారు. అన్ని రంగాల్లో బాలికలు ముందంజలో ఉన్నారని గమనించాలన్నారు. కార్యక్రమంలో 8,9 తరగతి బాలికలు, లక్ష్మీపేట, కేతవరం, వీరభద్రాపురం అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ ఎఎన్ఎం, మహిళా పోలీసు, ఎంపిహెచ్ పాల్గొన్నారు.

నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ-2020 అమలు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ-2020 ప్రకారం విద్యాబోధన చేయడం ముఖ్యమని ఎయిమ్స్ ట్రెజరర్ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక సిబిఐటి కళాశాలలో సోమవారం ఎంబిఎ విద్యార్థులకు ఎఐయంఎస్ అసెస్మెంట్ ఇండియన్ మేనేజ్మెంట్ స్కూల్స్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసింహారావు మాట్లాడుతూ బిజినెస్ స్కూల్ అఫ్ ఎకనామిక్స్, బిజినెస్ స్కూల్ అఫ్ డేటా సైన్సు, బిజినెస్ స్కూల్ అఫ్ ఈవెంట్ మేనేజ్మెంట్ వంటి కోర్సులను స్కూల్స్‌లో రూపొందించాలన్నారు. తద్వారా పిల్లలకు ఛాయస్ అఫ్ ఎడ్యుకేషన్ అనేది సులభంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎ ఆదిశేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ యం.బాల కోటేశ్వరి, ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఎంబిఎ హెచ్ఒడి ఉమాదేవి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

ఘనంగా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను చేసి తీరుతామని ఆ పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీ నారాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం లోకేష్ జన్మదినం సందర్భంగా 400 టెంకాయలు కొట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ 400 రోజుల్లో 4వేల కిలోమీటర్లు యువగళం పేరుతో ఈనెల 27 నుంచి పాదయాత్ర ప్రారంభిస్తారన్నారు. యువగలం ప్రధాన ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించి 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి చేసుకోవడమే ఉద్దేశమన్నారు. పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం వెంకట రమణారెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వర్‌రెడ్డి, రాయల్ కిరణ్, నవనీశ్వర్‌రెడ్డి, యనమల తులసిరెడ్డి, పొన్నతోట బ్రదర్స్ శీను, మల్లికార్జున, జింకల బాషా, గైబు, ఖదీర్, రఫీ, సర్దార్, జయచంద్ర, నెల్సన్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక కార్యాలయంలో లోకేష్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ చేపడుతున్న యువగళం ప్రకటనతో ప్రభుత్వ పెద్దల్లో ప్రకంపనలు ప్రారంభమయ్యాయన్నారు. యువగళం పర్యటన మూడున్నర నెలలకు కడప జిల్లాకు చేరుకుంటుందని, ఇందులో కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు. ప్రాంతాల మీదుగా అన్నమయ్య జిల్లాకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు విఎస్ ముక్తియార్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అసం రఘురామిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, కుతుబుద్దీన్ పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** స్థానిక టిడిపి కార్యాలయంలో నారా లోకేష్ బాబు పుట్టినరోజు వేడుకలను జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను వేంపల్లెలో ఆ పార్టీ నాయకులు సోమవారం వేర్వేరుగా, పోటాపోటీగా నిర్వహించారు. ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ తన సొంత కార్యాలయంలో కేక్ కట్ చేయగా.. టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ రామమునిరెడ్డి కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఇరువురు నాయకులు తాను చేసే వేడుకలకు రావాలని కార్యకర్తలపై ఒత్తిడి తెచ్చారు. ఈ పరిస్థితుల్లో కార్యకర్తలు ఎక్కడికి వెళ్లినా సమస్య అని కొందరు దూరంగా ఉన్నారు. మరి కొందరు కార్యకర్తలు, నాయకులు ఇరువురి దగ్గరకు వెళ్లారు. సతీష్‌రెడ్డి పార్టీని వీడినప్పటి నుంచి మండలంలో కార్యకర్తల్లో ఉత్సాహం కరువైంది. ఇప్పటి నుండే నాయకుల మధ్య పొరపచ్చలు రావడంతో పార్టీలోని కార్యకర్తలు ఎటు పోవాలో అని అయోమయంలో ఉన్నారు. వేంపల్లెలోని అయా ప్రాంతాల్లో ఉన్న వృద్ధాశ్రమంలో టిడిపి నాయకులు లోకేష్ పుట్టినరోజు సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి కార్యకర్తలు యాసిన్, రాహుల్, అర్షద్, గంగధర్, ఇమ్రాన్, తన్వర్, ప్రసాద్‌రెడ్డి, పివి రమణ, రామకృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఆర్‌వి రమేష్, శ్రీరాంరెడ్డి, గంగిరెడ్డి, వెంకటస్వామి, సుబ్బరాయుడు, వీరభద్ర డక్కా రమేష్ పాల్గొన్నారు. **ఖాజీపేట :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని శివ భక్తేంద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పత్తూరు ఉపసర్పంచు ముత్తూరు రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. టిడిపి మైనారిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కమలాపురం ఫరూఖ్ అహ్మద్, జలీల్ అహ్మద్, కమలాపురం గౌస్ మొహిద్దిన్, దాసరి శ్రీనివాసులు, పల్లె గంగాధర్, జెండాల మహబూబ్ బాషా, అగ్రహారం రమణ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండ రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ప్రేమాలయ నిరాశ్రేయుల కేంద్రంలో నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంటు ఉపాధ్యక్షులు నక్కల శివరామ్, ప్రధాన కార్యదర్శి వికాష్ హరి, జలతోటి జయకుమార్, గన్నెపాటి మల్లేష్, ఆమూరి బాలదాసు,రాష్ట్ర నాయకులు సి.యస్.నాసర్ ఆలీ, పోన్నోలు రాంప్రసాద్‌రెడ్డి, జీయా ఉద్దీన్, వరప్రసాద్, మాసాపేట శివ ,నబికోట్ శ్రీనివాసులు, మమ్మద్, కొండా సుబ్బయ్య ప్రేమ్ కుమార్, వార్డు ఇన్చార్జులు కోండ్రెడ్డి జనార్దన్ రెడ్డి, గాజులపల్లి రాఘవ, బండిజయశేఖర్, మురికినాటి సునీతా, పేయ్యల ప్రణవతి, పోన్నోలు సుమిత్రా రెడ్డి, మురికినాటి రామాంజనేయులు నాదెళ్ల దస్తగిరి, నగర నాయకులు పాల్గొన్నారు. **చింతకొమ్మ దిన్నెలో..** నారా లోకేష్ జన్మదిన సందర్భంగా మండల ఐటిడిపి ఛాంపియన్ దర్బార్ బాష ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపేటలో వెలిసిన గంగమ్మ దేవస్థానం ఆవరణంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదినాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, డి.వి సుబ్బారెడ్డి, మోహన్ బాబు, భాస్కర్ రెడ్డి, నాయకులు ఓబుల్ రెడ్డి, రాజారావు, పెట్రోల్ బంకు రవి,భాస్కర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

భారత స్వతంత్ర సమరయోధుల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ అగ్రగణ్యుడని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్రెడ్డి మాధురిరెడ్డి, బద్రీనాథ్, రాఘవయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రామేశ్వరం బాల బాలికల గ్రంథాలయంలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి చైతన్య సాంఘిక సేవా సంఘం అధ్యక్షులు కరుమూరు వెంకట రమణయ్య, విశ్రాంత హిందీ పండితులు దేవీ సత్యనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.రామయ్య. విశ్రాంత వైమానికదళ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట కొండయ్య, గ్రంథాలయం అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, క్రిష్ణమూర్తి, వెంకటరమణ, శ్రీనివాసులరెడ్డి, విదార్థులు పాల్గొన్నారు. ఎస్‌కెఎస్‌సి పూర్వ విద్యార్థులు స్థానిక టిబి రోడ్డులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి నరసింహ నేతాజీ గురించి వివరించారు. కార్యక్రమంలో హేమంత్, నరసింహ, భరత్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** నేతాజి సుబాష్‌చంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం, నేతాజి సోషల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవాసంఘం అధ్యక్షులు డాక్టర్ వై.వి.స్వరూప్‌కుమార్‌రెడ్డి, క్లబ్ ప్రతినిధి భాస్కర్‌రావు, టిటిడి పాలక మండలి సభ్యులు మారుతీ ప్రసాద్, సమన్వయకర్తలు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మహోన్నత వ్యక్తి అని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. స్థానిక వడ్డెర సంఘ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు. **కడప/ కడప అర్బన్ :** సుభాష్ చంద్రబోస్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, చరిత్ర శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివరామకృష్ణ, డాక్టర్ వై. సావిత్రి, డాక్టర్ ఏ నాగరాజు, చరిత్ర శాఖ అధ్యక్షురాలు డాక్టర్ శివపార్వతి, విశ్వనాధ్ జంతు శాస్త్ర శాఖ అధ్యాపాకులు పి రవి శేఖర్, సి నరసింహారావు శ్రీనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..** ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రసాద్ గౌడ్ సత్యం, గౌరీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు. **అల్ షిఫాలో..** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు అల్ షిఫా మానసిక వికాసం కేంద్రంలో నిర్వహించారు. వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి మానసిక దివ్యాంగ పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్స్ పంపిణీ చేశారు.

ఎర్రకోటని తలపించేలా జాతీయ జెండా

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఢిల్లీలోని ఎర్రకోటను తలపించేలా ప్రొద్దుటూరులో జాతీయ జెండాను ఎగురవేయనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా 100 అడుగుల ఎత్తులో ఈ జెండాను పురప్రజల నడుమ ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని వన్‌టౌన్ నుండి గాంధీ రోడ్డు మీదుగా విజయకుమార్ సర్కిల్ వరకు.. విజయకుమార్ సర్కిల్ నుండి బొల్ల వరం, రాజీవ్ సర్కిల్ వరకు.. అక్కడి నుండి కొర్రపాడు రోడ్డు, శివాలయం వరకు..శివాలయం సర్కిల్ నుండి మైదుకూరు రోడ్డు చివరి వరకు సుమారు 250 నుండి 300 పోల్స్‌కు లైటింగ్‌తో పట్టణానికి నూతన విద్యుత్‌శోభను తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదన తీసుకొచ్చిన మున్సిపల్ ఛైర్మెన్ లక్ష్మీదేవికి, వైస్ ఛైర్మెన్ బంగారురెడ్డికి, కౌన్సిలర్లకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

వివిధ జబ్బులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు ప్రభుత్వం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థికసాయం అందిస్తుందని మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి తెలిపారు. సోమవారం మునిరాజారెడ్డి ఆధ్వర్యంలో సిఎం రిలీఫ్ ఫండ్ రూ.4లక్షల20వేలు చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. ముద్దనూరుకు చెందిన కమలాదేవికి రూ.60 వేలు, ఉప్పలూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి రూ.లక్ష 20 వేలు, చిన్నదుద్యాల గ్రామానికి చెందిన సంటి కొండమ్మకు రూ.2,40,000 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు ఖదీర్ బాషా, నాయకులు పుల్లయ్య యాదవ్, మదన్ మోహన్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, బాలవీరయ్య, ప్రశాంత్ వినయ్, సునీల్ పాల్గొన్నారు.

26న సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - చాపాడు

ఈ నెల 26న శుక్రవారం వసంత పంచమి సందర్భంగా స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రెసిడెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, సెక్రటరీ కరెస్పాండంట్ వి.లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాధా యంకె నాయర్ తెలిపారు. సకల విద్యలకు నిలయమైన సరస్వతి దేవి దీవెనలు అందరికీ కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొనే పిల్లలకు పలక, బలపం పాఠశాలనే అందజేస్తామని తెలిపారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిజికల్ డైరెక్టర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దేవి కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రవి శంకర్‌ను రైఫర్‌గా ఎంపికైన సందర్భంగా దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల పీడీకి ఇలాంటి గౌరవం దక్కడం నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్ద రంగయ్య నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సమీపంలో ఉన్న గంగవరం పెద్ద రంగయ్య (73) సోమవారం మతి చెందారు. రంగయ్య నేత్రదానానికి ఆయన కుమారుడు రాజేష్, కుమార్తె గీత అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్రనిధి అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. నేత్రనిధి టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుడి ఇంటికెళ్లి పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు వయసు పరిమితంలేదన్నారు. ఏ వయసులో మరణించినా వెంటనే కుటుంబ సభ్యులు స్పందించి నేత్రనిధి 99665 09364, 70932 04537 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అంగన్వాడీ కేంద్రానికి గ్లాసులు, ప్లేట్లు అందజేత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని 15వ వార్డు ఎర్రగుడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో కౌన్సిలర్ పురుషోత్తం డేనియల్ ఆధ్వర్యంలో డాక్టర్ ఇసి గంగిరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైయస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్, సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి హాజరయ్యారు. కేక్ కట్ చేసి అంగన్‌వాడీ పిల్లలకు పంపిణీ చేశారు. అనంతరం ప్లేట్లు, చాపలు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఐడిసి ఎపి డైరెక్టర్ రాజేశ్వరి, మునిసిపల్ కో-ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, వైసిపి నాయకులు సూరి, కృష్ణమూర్తి, డేనియల్ బాబు, మాజీ కౌన్సిలర్ కోళ్ల భాస్కర్, శంకర్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మానవతా సేవా సంస్థ ప్రజలకు చేసే సేవలు అభినందనీయమని డాక్టర్ ఇసి దినేష్‌రెడ్డి, వైయస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం డాక్టర్ ఇసి గంగిరెడ్డి జయంతిని పురస్కరించుకొని స్థానిక దినేష్ నర్సింగ్ హోం వద్ద మానవతా సేవా సంస్థకు ఏడు లక్షల వ్యయంతో వైకుంఠ రథాన్ని డాక్టర్ ఇసి దినేష్‌రెడ్డి మానవతా సేవా సంస్థ సభ్యులకు వితరణ చేశారు. దినేష్‌రెడ్డి, వైయస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. హాల్ గంగాధర్‌రెడ్డి, మానవతా సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పులివెందుల పట్టణ అధ్యక్షులు రాఘవరెడ్డి, కొండారెడ్డి, రామ్మోహన్, కరుణాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మానవతా సభ్యులు పాల్గొన్నారు

వెండి నాగ పడగ వితరణ

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని బందలకుంట గ్రామంలోని బసవేశ్వర దేవాలయానికి జంగంరెడ్డిపల్లెకు చెందిన చిన్న ఈశ్వర్‌రెడ్డి తల్లిదండ్రులు నాగమ్మ, బసిరెడ్డి జ్ఞాపకార్థం రూ.లక్ష విలువ చేసే వెండితో శివునికి నాగ పడగను విరాళం ఇచ్చారు. సోమవారం ఆలయ అర్చకుడు అనిల్ స్వామికి అందజేశారు. అనంతరం శివ లింగానికి వెండి నాగ పడగను ధరించారు.

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - మైదుకూరు

మండలంలోని ఓబుళాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల నుంచి విచ్చేసిన వైద్య బృందం, జూనియర్ పశువైద్యులు జాతీయ సేవ పథకంలో భాగంగా నిర్వహించారు. అవసరమైన మందులు, ఖనిజ లవణ మిశ్రమాలను ఆరెస్మ, మన్కిన్డ్, నాచురల్ రెమెడీస్ కంపెనీ వారు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ రైతులకు పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యులు డాక్టర్ ఆర్.సుధాకర్, పశు వైద్య కళాశాల జాతీయ సేవ పథకం అధికారులు పి.కళ్యాణి, ఎ.ప్రశాంత్, సాయి దిలీప్ గుప్త, క్లినికల్ విభాగం ఆచార్యులు ఎం.భార్గవి, ఎం.భాస్కర్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

నేతాజీ సోషల్‌క్లబ్ సేవలు అపూర్వం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పదేళ్లుగా నేతాజీ సోషల్ క్లబ్ సాంఘిక శాస్త్రానికి చేస్తున్న సేవలు అపూర్వమని ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. నేతాజి సుభాష్‌చంద్రబోస్ జయంతి సం దర్భంగా క్లబ్ ఆధ్వ ర్యంలో సోమవారం నిర్వ హించిన సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్షకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ర్థులు సుమారు 200 మంది హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంచాలన్నారు. డిసిఇబి కార్యదర్శి శోభారాణి మాట్లాడుతూ ఇలాంటి ప్రతిభా పరీక్షల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ కన్వీనర్ భాస్కర్‌రావు, అధ్యక్షులు నాగరాజారావు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

CHANGE OF NAME

I SALIM MALIK (old name), S/O FAKRUDIN R/o D.No. 22/61, MOULANA AZAD STREET 4, PRODDATUR-516360. Have changed my name as SHAIK SALEEM MALIK (New name). Hence forth I may called as SHAIK SALEEM MALIK.

CHANGE OF NAME

I FAKRUDIN (old name) S/O Late SHAIK KHADER VALLI, R/o. D.No. 22/61, MOULANA AZAD STREET4, PRODDATUR-516360, Have changed my name as SHAIK FAKRUDDIN (New name). Hence forth I may called as SHAIK FAKRUDDIN.